# మెల్‌బోర్న్ పాయె

## బాక్సింగ్ డే టెస్టులో భారత్ దారుణ పరాభవం

- 184 పరుగుల తేడాతో ఓటమి ● టాపార్డర్ వైఫల్యం
- ఆసీస్‌కు 2-1 ఆధిక్యం ● డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ గల్లంతు!

**ఛేదించాల్సిన లక్ష్యం 340. ఆరంభంలో ముగ్గురు టాపార్డర్ బ్యాటర్లు పెవిలియన్‌కు వెళ్లారు. దారి చూపాల్సిన సీనియర్లు రోహిత్, కోహ్లీ, రాహుల్‌ది అదే వైఫల్య గాథ. కానీ జైస్వాల్, పంత్ పోరాటంతో గెలుపు మీద ఆశలు లేకున్నా ఓటమి గండాన్నైనా తప్పించుకోవచ్చునన్న ధీమా. మూడో సెషన్ ఆట మొదలైన కొద్దిసేపటికే పంత్ మరోసారి అనవసరపు షాట్‌కు పోయి వికెట్ పారేసుకోవడంతో ఆస్ట్రేలియా పుంజుకుంది. అక్కడ్నుంచి ఆతిథ్య జట్టు బౌలర్లు పట్టు సడలించలేదు. మూడో సెషన్‌లో 34 పరుగుల వ్యవధిలోనే ఆఖరి 7 వికెట్లను కోల్పోయిన రోహిత్ సేన మరో ఘోర అపజయాన్ని మూటగట్టుకుంది. ఈ గెలుపుతో ఆస్ట్రేలియా.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలోకి వచ్చింది. ఓటమితో సిరీస్ నిలబెట్టుకునే అవకాశంతో పాటు డబ్ల్యూటీసీ ఫైనల్ చేరుకునే అవకాశాలనూ టీమ్‌ఇండియా మరింత సంక్లిష్టం చేసుకుంది.**



మెల్‌బోర్న్: ఏం మారలేదు! అదే కథ.. అదే వ్యథ! బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో వైఫల్యాల పరంపరను భారత క్రికెట్ జట్టు దిగ్విజయంగా కొనసాగిస్తూ మరో పరాభవాన్ని మూటగట్టుకుంది. మెల్‌బోర్న్ టెస్టులో రోహిత్ సేన 184 పరుగుల తేడాతో ఓడి సిరీస్‌ను నిలబెట్టుకునే అవకాశంతో పాటు వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్తునూ సంక్లిష్టం చేసుకుంది. ఆట చివరి రోజు ఆస్ట్రేలియా నిర్దేశించిన 340 పరుగుల ఛేదనలో టీమ్‌ఇండియా.. 79.1 ఓవర్లలో 155 పరుగులకు కుప్పకూలి దారుణ ఓటమి పాలైంది. ఛేదనలో యశస్వీ జైస్వాల్ (208 బంతుల్లో 84, 8 ఫోర్లు), రిషభ్ పంత్ (104 బంతుల్లో 30, 2 ఫోర్లు) తప్ప మిగిలిన బ్యాటర్లెవరూ రెండంకెల స్కోరు కూడా చేయలేక చతికిలపడ్డారు. ఆసీస్ బౌలర్లలో సారథి, 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' పాట్ కమిన్స్ (3/28), స్కాట్ బొలాండ్ (3/39), నాథన్ లియాన్ (2/37) పర్యాటక జట్టును కట్టడి చేశారు. జనవరి 3 నుంచి సిడ్నీ వేదికగా సిరీస్‌లో చివరి టెస్టు మొదలుకానుంది.

### వాళ్లు మారలేదు

చేయాల్సిన పరుగులు 340. ఉన్న ఓవర్లు 92. చేతిలో 10 వికెట్లు. ఛేదన తేలికైతే కాదు గానీ అసాధ్యమైతే కాదు. ఆరంభంలో వికెట్ కాపాడుకుని తర్వాత బ్యాట్ ఝుళిపిస్తే గెలిచే అవకాశాలు మెరుగయ్యేవి. అందుకు తగ్గట్టుగానే భారత ఇన్నింగ్స్ కూడా నెమ్మదిగానే మొదలైంది. మొదటి 16 ఓవర్లకు భారత్ చేసిన స్కోరు 25/0. తన స్వభావానికి విరుద్ధంగా షాట్ల జోలికి పోకుండా 39 బంతుల్లో 9 పరుగులే చేసిన కెప్టెన్ రోహిత్ శర్మ.. కమిన్స్ వేసిన ఫుల్ డెలివరీని ఆడబోయి గల్లీలో మార్ష్‌కు క్యాచ్ ఇవ్వడంతో వికెట్ల పతనం మొదలైంది. అదే ఓవర్లో కమిన్స్.. కేఎల్ రాహుల్‌నూ డకౌట్‌గా వెనక్కి పంపి భారత్‌కు డబుల్ షాకిచ్చాడు. యావత్ భారత క్రికెట్ అభిమానులు గంపెడాశలు పెట్టుకున్న ఛేదనలో మొనగాడు విరాట్ కోహ్లీ (5) మరోసారి చేతులెత్తేశాడు. దీంతో లంచ్‌కు ముందే భారత్ 33/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది.

### ఆదుకున్న యశస్వీ, పంత్

8 పరుగుల వ్యవధిలో 3 కీలక వికెట్లు కోల్పోవడంతో భారత్ ఆత్మరక్షణలో పడింది. యశస్వీకి జతకలిసిన పంత్.. అనవసరపు షాట్ల జోలికి పోకుండా డిఫెన్స్‌నే ఆశ్రయించారు. రెండో సెషన్ ఆసాంతం ఈ ద్వయం కంగారూ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంది. ఈ క్రమంలో యశస్వీ.. లియాన్ వేసిన ఓవర్లో బౌండరీతో 127 బంతుల్లో అర్ధ శతకాన్ని పూర్తిచేశాడు. టెస్టులలో అతడికిది రెండో నెమ్మదైన హాఫ్ సెంచరీ. పంత్‌ను ఔట్ చేసేందుకు ఆసీస్ బౌలర్లు ఊరించే బంతులేసినా అతడు ఏకాగ్రత కోల్పోలేదు. రెండో సెషన్‌లో ఈ జోడీ 27.5 ఓవర్లు ఆడి 79 పరుగులు చేసింది.

### 34 పరుగుల వ్యవధిలో 'ఖేల్' ఖతం

యశస్వీ, పంత్ పట్టుదలతో డ్రా దిశగా సాగుతున్న భారత ఇన్నింగ్స్ మూడో సెషన్ తర్వాత కుదుపునకు లోనైంది. థర్డ్ సెషన్‌లో హెడ్ వేసిన 59వ ఓవర్లో నాలుగో బంతిని భారీ షాట్ ఆడబోయిన పంత్.. లాంగాన్ వద్ద మార్ష్ డైవింగ్ క్యాచ్‌తో క్రీజును వీడాడు. భారత ఓటమికి బీజం పడిందిక్కడే. ఆ తర్వాత 20 ఓవర్లలోపే టీమ్‌ఇండియా ఆట ముగిసింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో నితీశ్ రెడ్డి (1), సీనియర్ బ్యాటర్ రవీంద్ర జడేజా (2) అలా వచ్చి ఇలా వెళ్లారు. వాషింగ్టన్ సుందర్ (45 బంతుల్లో 5 నాటౌట్)తో కలిసి ఏడు ఓవర్ల పాటు వికెట్ కాపాడుకున్న యశస్వీ.. కమిన్స్ వేసిన 71వ ఓవర్లో థర్డ్ అంపైర్ వివాదాస్పద నిర్ణయంతో వెనుదిరిగాల్సి వచ్చింది. లోయరార్డర్ బ్యాటర్లూ పోరాడకపోవడంతో భారత్.. 155 పరుగులకు ఆలౌట్ అయింది. ఒక దశలో 121/3తో పటిష్ఠంగా ఉన్న రోహిత్ సేన.. 34 పరుగుల వ్యవధిలో చివరి ఏడు వికెట్లు కోల్పోయింది.



జైస్వాల్ (84)

**సంక్షిప్త స్కోర్లు**

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 474 ఆలౌట్; భారత్ తొలి ఇన్నింగ్స్: 369 ఆలౌట్;ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 234 ఆలౌట్; భారత్ రెండో ఇన్నింగ్స్: 79.1 ఓవర్లలో 155 ఆలౌట్ (జైస్వాల్ 84, పంత్ 30, కమిన్స్ 3/28, బొలాండ్ 3/39)

### జైస్వాల్ ఔట్‌పై వివాదం

మెల్‌బోర్న్: ఓపెనర్ జైస్వాల్ ఔట్‌పై వివాదం నెలకొన్నది. కమిన్స్ బౌలింగ్‌లో కీపర్ క్యారీ క్యాచ్‌పై థర్డ్ అంపైర్ సైకత్ షర్ఫుద్దుల్లా నిర్ణయం దీనికి కారణమైంది.డ్రా కోసం ఆడుతున్న సమయంలో జైస్వాల్ క్యాచ్‌పై ఆన్‌ఫీల్డ్ అంపైర్ విల్సన్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఆసీస్ డీఆర్‌ఎస్‌కు వెళ్లింది. పలుమార్లు పరిశీలించిన అంపైర్ సైకత్..బంతి బ్యాట్‌ను తాకినట్లు స్నికోమీటర్‌లో కనిపించకపోయినా ఔట్ అని ప్రకటించాడు. దీంతో స్టేడియంలో ఉన్న ప్రేక్షకులు చీటర్ చీటర్ అంటూ పెద్దగా అరిచారు. దీన్ని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్‌శుక్లా తీవ్రంగా తప్పుబట్టాడు.

### డబ్ల్యూటీసీ.. ఈ సారి కష్టమే!

మెల్‌బోర్న్: వరుసగా రెండుసార్లు ఫైనల్, గద గెలవకున్నా రన్నరప్‌తో సరిపెట్టుకున్నాం. నిన్నా మొన్నటి దాకా పాయింట్ల పట్టికలో అగ్రస్థానం. మరో రెండు మ్యాచ్‌లు గెలిచుంటే ఇప్పటికీ ఏ ఆందోళన లేకుండా హాయిగా లార్డ్స్‌కు టికెట్ బుక్ చేసుకునేవాళ్లమే. కానీ స్వదేశంలో కివీస్ చేతిలో అవమానకర క్లీన్‌స్వీప్‌కు తోడు ఆసీస్ పర్యటనలో ఓటములు.. మెల్‌బోర్న్‌లోనూ అదే కథ. ఇంకేముంది! డబ్ల్యూటీసీలో భారత అవకాశాలు దాదాపుగా మూసుకుపోయాయి.

### వెల్లువలా వచ్చారు!

మెల్‌బోర్న్: బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో కీలకమైన నాలుగో టెస్టుకు ఆతిథ్యమిచ్చిన మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)కు ప్రేక్షకులు వెల్లువలా కదిలొచ్చారు. ఐదు రోజుల పాటు ఆసక్తికరంగా సాగిన ఈ మ్యాచ్‌కు 3,50,700 (ఐదో రోజు ఆట రెండో సెషన్ వరకు) మంది హాజరయ్యారని ఎంసీజీ తెలిపింది. మెల్‌బోర్న్‌లో 1937 యాషెస్ సందర్భంగా డాన్ బ్రాడ్‌మన్ ఆట చూసేందుకు 3,50,534 మంది ప్రేక్షకులు హాజరు కాగా తాజాగా ఆ రికార్డు కనుమరుగైంది.

## సీఎం కప్ కబడ్డీ విజేత రంగారెడ్డి



మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 30 : సీఎం కప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నీలో రంగారెడ్డి ఓవరాల్ విజేతగా నిలిచింది. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన వేర్వేరు ఫైనల్స్‌లో రంగారెడ్డి జట్లు అద్భుత ప్రదర్శన కనబరిచాయి. బాలుర తుదిపోరులో రంగారెడ్డి 34-31తో వనపర్తిపై విజయం సాధించింది. బాలికల ఫైనల్లోనూ రంగారెడ్డి 57-39తో నల్లగొండపై గెలిచింది. బాలుర కేటగిరీలో నల్లగొండ, బాలికల విభాగంలో హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచాయి. బహుమతి ప్రదాన కార్యక్రమంలో టీవోఏ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

### భాగ్యను ఆదుకుంటాం

- సీఎం రేవంత్‌రెడ్డి హామీ



గూడూరు, డిసెంబర్ 30: పారా త్రోబాల్ క్రీడాకారిణి దయ్యాల భాగ్యను అన్ని విధాలా ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. భాగ్యను సోమవారం సీఎం దగ్గరకు మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, ప్రభుత్వ విప్ అయిలయ్య తీసుకెళ్లి సమస్యను వివరించారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గొల్లగూడేనికి చెందిన భాగ్య..ఇటీవల అంతర్జాతీయ స్థాయి పారా త్రోబాల్ పోటీల్లో పసిడి పతకంతో మెరిసింది. నిరుపేద కుటుంబానికి చెంది దివ్యాంగురాలైన భాగ్యను భవిష్యత్‌లో ఆదుకుంటామని, ఒలింపిక్స్‌లో రాణించే ప్లేయర్లకు ఇచ్చే ప్రోత్సాహకాలను ఆమెకు అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు.



ప్రతిష్ఠాత్మక పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జివాంజీ దీప్తికి సోమవారం 3లక్షల చెక్ అందజేస్తున్న మెగాస్టార్ చిరంజీవి. ఈ కార్యక్రమంలో గోపీచంద్, చాముండేశ్వర్‌నాథ్ పాల్గొన్నారు.

## అక్షిత్ అదుర్స్

**అజేయ సెంచరీతో విజృంభణ**



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హెచ్‌సీఏఆధ్వర్యంలో జరుగుతున్న 'సీ' డివిజన్ వన్డే లీగ్‌లో మురళీ అక్షిత్ అదరగొట్టాడు. సోమవారం హైదరాబాద్ జిల్లా టీమ్‌తో జరిగిన మ్యాచ్‌లో పికెట్ జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. హైదరాబాద్ నిర్దేశించిన 243 పరుగుల లక్ష్యఛేదనకు దిగిన పికెట్ వికెట్ నష్టపోయి 41.5 ఓవర్లలో విజయాన్నందుకుంది. ఓపెనర్ గూడురు మురళీ అక్షిత్ (140 బంతుల్లో 146 నాటౌట్, 22ఫోర్లు) సెంచరీతో అదరగొట్టాడు. దూకుడుగా ఆడిన అక్షిత్ తన ఇన్నింగ్స్‌లో 22 ఫోర్లతో ఆకట్టుకున్నాడు. అంతకు ముందు హైదరాబాద్ టీమ్ నిర్ణీత 50 ఓవర్లలో 242/4 స్కోరు చేసింది.



## గత చిత్రాలను మరిపించేలా..

వివాదాల సంగతెలావున్నా.. కెరీర్ పరంగా మాత్రం గుర్తుండిపోయే విజయాన్ని అందుకున్నారు అల్లు అర్జున్. ఆయన సృష్టించబోయే రికార్డే ప్రస్తుత మూవీ మేకర్లందరి టార్గెట్ అయ్యేలా ఉంది. ఏదేమైనా 'పుష్ప 2'తో దేశం మొత్తం తనవైపు చూసేలా చేశారు బన్నీ. ఆయన చేయబోయే సినిమాపై కూడా అంచనాలు ఇప్పుడు భారీ స్థాయిలో ఉంటాయి. త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో తన తాజా ప్రాజెక్ట్‌ని ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు బన్నీ. కాగా, ఈ సినిమా ఎప్పుడు స్టార్ట్ అవుతుంది? రిలీజ్ ఎప్పుడు? ఇవి ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నలు. వీటికి ఆ చిత్ర నిర్మాత సూర్యదేవర నాగవంశీ ఇటీవలే సమాధానమిచ్చారు. త్వరలోనే బన్నీ, త్రివిక్రమ్ కూర్చుని పాత్ర గెటప్, సినిమా సెటప్ విషయాలు చర్చిస్తారు. 2025 మధ్యలో ఈ సినిమా షూటింగ్ స్టార్ట్ చేస్తాం. 2026 చివర్లో రిలీజ్ చేస్తాం. మారిన బన్నీ ఇమేజ్ దృష్ట్యా.. పానిండియా స్థాయిలో సినిమా ఉంటుంది. బన్నీ, త్రివిక్రమ్ కలయికలో వచ్చిన గత చిత్రాలను మరిపించేలా అద్భుతమైన కథతో ఈ సినిమాను నిర్మించనున్నాం' అని తెలిపారు.

## 2025 లక్కీ ఇయర్



వచ్చే ఏడాది ఆడియన్స్‌కి డబుల్ ట్రీట్ ఇవ్వనున్నది అందాలభామ నిధి అగర్వాల్. ఒకే ఏడాది ఇద్దరు సూపర్‌స్టార్లతో రెండు పానిండియా సినిమాల్లో ఆమె మెరవనున్నది. అందులో ఓ సినిమా పవన్‌కల్యాణ్ 'హరిహర వీరమల్లు' కాగా, రెండో సినిమా ప్రభాస్ 'రాజా సాబ్'. ఈ సందర్భంగా ఆమె ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. 'పవన్ సార్‌తో 'హరిహర వీరమల్లు'లో నటించడం చాలా ఆనందంగా ఉంది. అసలు ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం గర్వకారణం కూడా. ఇక 'రాజా సాబ్'లో ప్రభాస్ సార్‌తో కలిసి నటించడం మరిపోలేని అనుభూతి. సినిమాకోసం టీమ్ మొత్తం డెడికేటెడ్‌గా పనిచేస్తున్నారు. ఈ రెండు పాన్‌ఇండియా సినిమాలూ 2025లోనే విడుదల కానున్నాయి. అందుకే 2025 నా లక్కీ ఇయర్. వీటితో పాటు వచ్చే ఏడాది తెలుగు, తమిళంలో మరికొన్ని సర్‌ప్రైజింగ్ మూవీస్‌లో నటిస్తున్నాను. వాటి గురించి త్వరలో తెలియజేస్తా.' అన్నారు నిధి అగర్వాల్.

## గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తెచ్చుకున్నారు

### సంధ్య థియేటర్ ఘటనపై పవన్‌కల్యాణ్



సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన, అల్లు అర్జున్ అరెస్ట్ అంశాలపై అగ్ర నటుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించారు. సోమవారం అమరావతిలో జరిగిన మీడియా చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. ఈ వ్యవహారం గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తెచ్చుకున్నట్లుందని వ్యాఖ్యానించారు. ఘటన జరిగిన రెండో రోజు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఉంటే ఈ వివాదం ఇంత దూరం వచ్చేది కాదన్నారు. అదే సమయంలో సినిమా అంటే అందరి భాగస్వామ్యమని, అల్లు అర్జున్‌ను ఒక్కడినే దోషిగా చూపించడం కరెక్ట్ కాదని చెప్పారు. తన వల్లే ఒకరు ప్రాణాలు కోల్పోయారనే బాధ అల్లు అర్జున్‌లో ఉందని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. 'వెంటనే వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తే బాగుండేది. అల్లు అర్జున్ కాకపోయినా ఆయన తరపున ఎవరో ఒకరు వెళ్లి రేవతి కుటుంబానికి భరోసా ఇచ్చి ఉండాల్సింది. చట్టం అందరికీ సమానం. ఈ విషయంలో నేను పోలీసులను తప్పుపట్టను. వారు భద్రత గురించే ఆలోచిస్తారు. గతంలో చిరంజీవిగారు కూడా అభిమానులతో కలిసి థియేటర్లలో సినిమాలు చూసేందుకు వెళ్లేవారు. కాకపోతే ఎవరూ గుర్తుపట్టకుండా ముసుగు వేసుకొని ఒక్కరే థియేటర్‌కు వెళ్లేవారు' అని పవన్‌కల్యాణ్ గుర్తుచేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పాపికొండలు, విజయనగరం అటవీప్రాంతంలో మంచి లొకేషన్స్ ఉన్నాయని, అక్కడ మౌలిక సదుపాయాలు కల్పిస్తే సినిమా షూటింగులకు బాగుంటుందని పవన్‌కల్యాణ్ తెలిపారు. ఇండస్ట్రీలో క్వాలిటీ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్ ఉండాలని, స్టోరీ టెల్లింగ్ స్కూల్స్ రావాలని, అప్పుడే నాణ్యమైన సినిమాలొస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.



చిత్రం

## ఇట్స్ ఏ బ్లాక్‌బస్టర్ పొంగల్

వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాపై అంచనాలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే విడుదలైన రెండు పాటలూ జనబాహుళ్యంలో బాగా వినిపిస్తున్నాయి. వందశాతం సక్సెస్‌రేట్ ఉన్న దర్శకుడు అనిల్ రావిపూడి నుంచి మరో బ్లాక్‌బస్టర్ పక్కా అని సినీ అభిమానులు ఫిక్స్ అయిపోయారు. ప్రచారంలో కూడా సినిమా దూసుకుపోతున్నది. సోమవారం గాయని రోహిణి సోరట్, భీమ్స్ సిసిరోలియోలతో కలిసి హీరో వెంకటేశ్ స్వయంగా ఆలపించిన పండుగ ప్రత్యేక గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. 'గొబ్బియల్లో గొబ్బియల్లో.. పండగొచ్చే గొబ్బియల్లో.. ఎవ్రీబడీ గొబ్బియల్లో.. సింగ్ దిజ్ మెలోడీ గొబ్బియల్లో.. పెద్ద పండగండి గొబ్బియల్లో.. లెట్స్ గెట్ ట్రెండీ గొబ్బియల్లో.. కమాన్.. బేసికల్లీ.. టెక్నికల్లీ.. లాజికల్లీ.. ప్రాక్టికల్లీ.. అండ్ ఫైనల్లీ.. ఇట్స్ ఏ యాటిట్యూడ్ పొంగలూ.. ఇట్స్ ఏ బ్లాక్‌బస్టర్ పొంగలూ..' అంటూ ట్రెండీగా రామజోగయ్యశాస్త్రి రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరిచారు. వెంకటేశ్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరిలపై సంక్రాంతి సంబరాల నేపథ్యంలో తెరకెక్కించిన ఈ పాట సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఉపేంద్ర లిమాయే, సాయికుమార్, నరేష్, వీటీ గణేష్, మురళీధర్‌గౌడ్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, నిర్మాత: శిరీష్, సమర్పణ: దిల్‌రాజు, నిర్మాణం: శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్.

## రోహిత్‌శెట్టి సూపర్‌కాప్ ఫిల్మ్



బాలీవుడ్‌లో పోలీస్ కథలను తెరకెక్కించడంలో సిద్ధహస్తుడిగా పేరు తెచ్చుకున్నారు దర్శకుడు రోహిత్‌శెట్టి. 'కాప్ యూనివర్స్'లో భాగంగా ఆయన తీసిన 'సింగం' సిరీస్ చిత్రాలు పాపులర్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన మరో సూపర్‌కాప్ చిత్రానికి సిద్ధమవుతున్నారు. తనకు అత్యంత సన్నిహితుడు అయిన ముంబయి మాజీ జాయింట్ పోలీస్ కమిషనర్ రాకేష్ మారియా జీవిత కథ ఆధారంగా ఓ సినిమాను తెరకెక్కించబోతున్నారు. రోహిత్‌శెట్టి రూపొందించిన కాప్ యూనివర్స్ చిత్రాల పరిశోధన, సమాచార సేకరణ విషయంలో రాకేష్ మారియా ఎంతో సహాయాన్ని అందించారు. ఆయన ఇచ్చిన ఇన్‌పుట్స్‌తోనే తాను పోలీస్ కథలను అద్భుతంగా తీయగలిగానని రోహిత్‌శెట్టి అనేక సందర్భాల్లో తెలిపారు. ఈ నేపథ్యంలో పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా పేరున్న రాకేష్ మారియా జీవిత కథ ఆధారంగా సినిమా రాబోతుండటం ఆసక్తికరంగా మారింది. ఈ సినిమాలో జాన్‌అబ్రహమ్ హీరోగా నటించనున్నారు. ఈ చిత్రం వేసవిలో సెట్స్‌మీదకు వెళ్లనుంది.

## ఆ ట్రెండ్‌ను అంగీకరించాల్సిందే!



సీనియర్ హీరోలు తమ చిత్రాల్లో యువ నాయికలతో జోడీ కట్టడం, తెరపై వారితో రొమాన్స్ పండించడం భారతీయ చిత్రసీమలో సాధారణమే. అయితే ఈ ధోరణి పట్ల అసంతృప్తి వ్యక్తం చేసేవాళ్లు చాలా మంది కనిపిస్తారు. అరవై, డెబ్బై ఏళ్లు దాటిన హీరోలు కూడా అప్పుడే ఇండస్ట్రీలోకి వచ్చిన యువ కథానాయికలతో ఆడిపాడటం ఏంటనే విమర్శలు కూడా వస్తుంటాయి. తాజాగా వీటిపై మలయాళ అగ్ర హీరో మోహన్‌లాల్ స్పందించారు. చక్కటి ఆరోగ్యం, తెరపై ఫిట్‌గా కనిపిస్తామనే ఆత్మవిశ్వాసం ఉంటే కథానాయకులకు వయసు ఏమాత్రం సమస్య కాబోదని చెప్పారు. స్టార్‌డమ్ సంపాదించుకున్న హీరోలు ఇండస్ట్రీలో చాలా కాలం రాణిస్తారు కాబట్టి ఈ విషయం గురించి ఆలోచించొద్దన్నారు. ఆయన మాట్లాడుతూ 'ఈ ట్రెండ్ ఇండస్ట్రీలో ఎన్నో ఏళ్ల నుంచి ఉంది. ఆరోగ్యం సహకరిస్తే వందేళ్ల వరకైనా నటించొచ్చు. నటీనటులకు పాత్రల ఎంపిక చాలా ప్రధానం. క్యారెక్టర్‌లో కంఫర్టబుల్‌గా ఫీల్ అవడం ముఖ్యమైన అంశం. వీటి ఆధారంగానే తమ పక్కన నటించే వారి గురించి నిర్ణయం తీసుకోవాలి. ప్రేక్షకుల ఆదరణ ఉంటే ఇలాంటి విషయాల గురించి పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు' అని చెప్పారు. ఇటీవలే ఆయన పాన్ ఇండియా ఫాంటసీ చిత్రం 'బరోజ్' ప్రేక్షకుల ముందుకొచ్చింది.

## ఆ వార్తలో నిజం లేదు



**'కల్కి 2898ఏడీ'** సినిమా షూటింగ్ త్వరలో మొదలుకానున్నదనీ.. దీపిక పదుకోన్ షూట్‌లో పాల్గొనబోతున్నారని ఓ వార్త బాలీవుడ్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. రీసెంట్‌గా ఈ వార్తపై స్పందించింది దీపికా పదుకోన్. ''కల్కి' షూటింగ్ త్వరలో మొదలుకానున్నదని వినిపిస్తున్న మాటలో నిజంలేదు. నావరకూ ఎలాంటి సమాచారం లేదు కూడా. అయినా ప్రస్తుతం నా ఆలోచనలన్నీ నా కుమార్తె 'దువా' పైనే ఉన్నాయి. తనను దగ్గరుండి చూసుకోవాలి. మా అమ్మ నన్ను ఎలా అయితే పెంచిందో.. అదే విధంగా నా కూతుర్ని నేను పెంచాలి. తన ప్రతి క్షణాన్నీ నేను ఆస్వాదించాలి.' అంటూ చెప్పుకొచ్చింది దీపిక. ఇదిలావుంటే.. కల్కి పార్ట్ 2 ప్రోగ్రెస్ గురించి ఇటీవలే ఆ చిత్ర నిర్మాతల్లో ఒకరైన స్వప్నదత్ మీడియాతో మాట్లాడారు. 'ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నది. తొలిపార్ట్‌తో పాటే సెకండ్ పార్ట్ షూటింగ్ కూడా 35శాతం పూర్తయింది. ఇందులో కూడా దీపిక పదుకోన్ కొన్ని సన్నివేశాల్లో అమ్మగా కనిపిస్తారు. రెగ్యులర్ షూటింగ్ ఎప్పటినుంచి ప్రారంభించాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.' అంటూ క్లారిటీ ఇచ్చారు.

## బాపు భావోద్వేగ ప్రయాణం



నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో ఓ వ్యవసాయ కుటుంబ భావోద్వేగ ప్రయాణమే ప్రధాన ఇతివృత్తంగా రూపొందుతోన్న చిత్రం 'బాపు'. నటుడు బ్రహ్మాజీ లీడ్‌రోల్ పోషిస్తున్నారు. దయా దర్శకత్వంలో రాజు, సిహెచ్ భానుప్రసాద్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆమని, బలగం సుధాకర్‌రెడ్డి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ, కీలక పాత్రధారులు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని సోమవారం నటుడు రానా దగ్గుబాటి ఆవిష్కరించారు. హాయిగా డైనింగ్ ఛైర్‌లో కూర్చుని, తనకోసం వడ్డించిన వంటకాలవైపు చూస్తున్న తండ్రిని.. ఆయన చుట్టూ గుమిగూడిన కుటుంబాన్ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. చుట్టూ ఉన్న కుటుంబసభ్యుల ఎక్స్‌ప్రెషన్స్ డిఫరెంట్‌గా ఉన్నాయి. ఇది డార్క్ కామెడీ, హ్యూమర్‌తో కూడిన ఎమోషనల్ జర్నీ అనీ, మనసులను హత్తుకునేలా ఈ సినిమా ఉంటుందని, త్వరలోనే విడుదల చేస్తామని మేకర్స్ చెబుతున్నారు. మణి ఏగుర్ల, రవి చర్ల, గంగవ్వ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వాసు పెండెం, సంగీతం: ఆర్.ఆర్.ధ్రువన్, నిర్మాణం: క్రామేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అభీరా ప్రొడక్షన్స్.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.